


# పనిమనిషి

''ఏమండీ! మన గంగ పెళ్లి కుదిరింది'' మూడోసారి చెప్పింది మా ఆవిడ. ఇక లాభం లేదని చదువుతున్న పేపర్ మడిచి పక్కన పెట్టేశాను.

''ఇంతకీ పెళ్లెప్పుడు?''

''వారం రోజుల్లో'' దిగులుగా అంది. ''మరో పది రోజుల్లో అది వెళ్లిపోతుంది'' ఏదో సొంత కూతురు అత్తారింటికెళ్లిపోతున్నట్టు బాధపడిపోతోంది ఆవిడ.

ఇంతకీ ఆవిడ చెబుతున్న 'మన గంగ' అంటే ఆవిడ తరపుచుట్టం కాదు, నా తరపు చుట్టం కాదు. మా ఆవిడకి అత్యంత ఆప్తురాలైన మా పనిమనిషి. రెండేళ్లబట్టీ మా ఇంట్లో పని చేస్తోంది. మా ఆవిడకి తల్లో నాలికలా మసలుతూ మా ఇంట్లో ఒక మనిషైపోయింది.

రోజూ తెల్లవారిందగ్గర నుంచీ మొదలవుతుంది గంగ నామస్మరణం. ''గంగా ఆ పని చూడు, గంగా ఈ పని చూడు'' అంటూ మాకదే సుప్రభాతం.

ఎప్పుడైనా రెండ్రోజులు వరుసగా గంగ రాకపోతే ఈవిడ గంగవెర్రులెత్తిపోతూ ఉంటుంది.

ఒక పనిమనిషి మీద అలా ఆధారపడటం, అంతలా ఎటాచ్‌మెంట్ పెంచుకోవడం నాకు నచ్చదు.

ఆమధ్య ఒక రోజు సాయంత్రం ఆఫీస్ నుండి కాస్త పెంద్రాళే ఇంటికొచ్చి తలుపు తట్టాను. గబగబా పరిగెత్తుకొచ్చి తలుపు తీసింది మా శ్రీమతి. నన్ను చూస్తూనే నీరుగారిపోయి ''మీ..రా''? అంది నీరసంగా.

''నేనే. ఏం? ఎవరనుకున్నావ్?'' కోపంగా అడిగాను.

''పనిమనిషనుకున్నాలెండి'' నిరాశగా అంది.

నాకు వళ్లు మండిపోయింది.

''ఈ రోజు పొద్దున్న కూడా పనిలోకి రాలేదు. ఇంతెడు పనీ అలాగే ఉంది'' స్వగతంగా అనుకుంటూ పెరట్లోకెళ్లిపోయింది.

అదీ ఆవిడ వరస.

ఇదంతా చూస్తుంటే నాకు చిర్రెత్తుకొస్తూ ఉంటుంది.

నాలుగు రోజుల క్రితం మరో స్నేహితుడు రాజేష్ ఇంట్లో పార్టీకెళ్లినప్పుడు వాళ్లావిడ చేదోడు వాదోడుగా ఉంటూ చకచకా తిరుగుతున్న ఒక పిల్లని చూసి ముచ్చట పడిపోయింది మా శ్రీమతి. ఆ పిల్ల, వాళ్లింట్లో పనిచేసే సుబ్బి చెల్లెలి కూతురట. ఎప్పుడైనా ఆవిడ పిలిచినప్పుడు సాయానికొస్తుందట. ఆ పిల్ల ఉండేది మా ఏరియాలోనే అని చెప్పింది. అప్పటికే గంగ పెళ్లి మాటలవుతున్నాయేమో మరో పనిమనిషి కోసం అన్వేషిస్తున్న మా ఆవిడకి ఎడారిలో ఒయాసిస్‌లా కనిపించిందా పిల్ల. పార్టీ హడావుడిలో ఆ పిల్ల వివరాలు కనుక్కోవడం కుదరలేదట.

అదిగో అప్పట్నించీ తినేస్తోంది నన్ను. ''ఆ పిల్ల ఎడ్రస్ కనుక్కోండి. మీ స్నేహితుడికి ఫోన్ చెయ్యండి'' అంటూ.

ఆఫ్ట్రాల్ ఒక పనిపిల్ల కోసం ఫోన్ చెయ్యడం, ఎడ్రస్ కనుక్కోవడం. ఇంకా నయం పేపర్లో వేయించి టీవీలో అనౌన్స్ చేయించమనలేదు. ఈవిడ ధోరణి బొత్తిగా బాలేదు.

అయినా ఈ ఆడవాళ్లేమిటో మగవాళ్లకు దీటుగా ఉద్యోగాలు చేస్తారు, ఊళ్లేళతారు. ఇంటా బయటా అన్ని పనులూ చక్కబెట్టుకుంటారు. ఇన్నీ సునాయాసంగా చేసేవాళ్లు ఒక్క పనిమనిషి విషయంలో మాత్రం ఎందుకింత ఆధారపడిపోతారో?

పనిలో పనిగా కాస్త అంట్లు తోమేసుకుని, ఇల్లు శుభ్రం చేసేసుకుంటే సరిపోతుందిగా. బట్టలకెలాగూ వాషింగ్‌మెషీన్ ఉంది.

అంతేనా? నిముషాల్లో రుబ్బేసే గ్రైండర్లూ, సెకన్లలో వండి పెట్టే మైక్రో ఓవెన్లూ, ఇల్లు శుభ్రం చేసే వాక్యూమ్ క్లీనర్లూ, ఒకటేమిటి అన్నీ అధునాతన గృహోపకరణాలు ఉన్నాయి. ఈ రోజుల్లో ఆడవాళ్ల పని సులువైపోయింది. అయినా ఎందుకో వీళ్లు పనిమనిషి పనిమనిషంటారు. ఆ కాస్త పనీ చేసుకుంటే ఒళ్లేమైనా అరిగిపోతుందా! మరీ నామోషీ కాకపోతే.

రాజేష్‌గాడి ఫోన్ నెంబర్ నాకు గుర్తు లేదు. ఇంటికెళ్లాలంటే బద్ధకం. అందులోనూ ఈ విషయమై అడగడానికి పనికట్టుకుని వెళ్లాలా?

ఈ రోజు కూడా ఆవిడ మళ్లీ ఇదే పోరు. నేనేదో చెప్పబోతుండగా వాళ్ల అమెరికా చెల్లెలు దగ్గర నుంచి ఫోనొచ్చింది.

అమ్మయ్య! అరగంట దాకా ఫోన్ వదిలేది లేదు. ఆపైన అమెరికా ముచ్చట్లతో సరిపోతుంది.

కాసేపట్లో ఇంత మొహం చేసుకొచ్చింది మా ఆవిడ. వాళ్ల చెల్లెలు కొత్త కారు కొందిట. లేటెస్ట్ మోడల్‌ట. త్వరలో ఇల్లు కొనబోతున్నారట ఎంతైనా అది అదృష్టవంతురాలంటూ ఏవేవో చెబుతోంది.

నాకు ఛాన్స్ దొరికింది. ''ఆ.. ఏం అదృష్టంలే. ఎన్ని ఉంటే మాత్రం వాళ్లకి మనకిలా పనిమనుషులుండరుగా. ఇంట్లో పనులన్నీ ఆవిడే చేసుకోవాలి'' అన్నాను.

మా ఆవిడ కాస్త ఖంగు తింది. ఆవిడ తెల్లముఖం వేయడం చూసి నేను మరింత రెచ్చిపోయాను. మనసులో ఉన్నది కక్కేయడానికి అవకాశం దొరికింది. ''అసలు వెస్టర్న్ కంట్రీస్ వాళ్లకి మనలా భేషజాలుండవోయ్. డిగ్నిటీ ఆఫ్ లేబర్ తెలిసినవాళ్లు కాబట్టీ అలా డెవలప్ అయ్యారు. ఏ పనీ చిన్నతనంగా ఫీలవ్వరు. అయినా మన పని మనం చేసుకోవడానికి నామోషీ ఏమిటి? ఇలా పనివాళ్ల మీద ఆధారపడటం ఆ తర్వాత వాళ్లు మానేస్తే బాధపడటం'' అవకాశం దొరికింది కదాని క్లాస్ పీకాను.

నావైపు చురుగ్గా చూసింది. ఇంతలో ''మమ్మీ'' అంటూ చిన్నది అరిచింది. 'మీ సంగతి తర్వాత చెబుతానన్నట్టు' చూసి లోపలికి పరిగెట్టింది.

★ ★ ★

మర్నాడు సాయంత్రం టీ తాగుతుండగా అంది మా ఆవిడ ''రాత్రంతా ఆలోచించానండీ. మీరు

చెప్పింది కరెక్టు. ఎవరి పని వాళ్లు చేసుకోవడానికి చిన్నతనం దేనికి? రేపట్నించీ అమలుచేసేస్తాను''

ఆహా! ఎంత చల్లని వార్త.

''మరి ఎలా అని అడగరేం?''

''ఎలా ఏముంది? ఒక్క గంట ముందు లేస్తే..'' నా మాట పూర్తి కాలేదు.

''కరెక్ట్ ఒక్క గంట ముందు లేస్తే సరిపోతుంది. అలారం పెడతాను. మీకసలే తొందరగా తెలివి రాదు'' అంది.

ఆవిడ లేవడానికీ, నా నిద్రకీ సంబంధం ఏమిటో అనుకుంటూ ''నేనెందుకు లేవడం? నువ్వు కదా లేవాలి'' అన్నాను.

''భలే వారే. మీరే చెప్పారుగా మన పని మనం చేసుకోవడం నామోషీ ఏమిటి? ఇద్దరం కలిసి చేసేస్తే ఇంకెవరి మీదా ఆధారపడనక్కరలేదు కదా!'' అంది. ఈసారి ఖంగు తినడం నా వంతయింది. ఇది నేనూహించని పరిణామం. తిరిగితిరిగి నా మీదకొచ్చిందేమిటి?

''నేను... నేను చెయ్యాలా?''

''ఏం తప్పా?'' గిరుక్కున వెనక్కు తిరుగుతూ నిలదీసింది.

''అబ్బే తప్పేం లేదనుకో'' ఆవిడ సత్యభామ ఫోజు చూసి కొంచెం తగ్గాను. ''కానీ ఈ పనులన్నీ.. నాకు అలవాటు లేవు కదా?'' నసిగాను.

''ఆ.. అలవాటుదేముంది...ఇదేమన్నా బ్రహ్మ విద్యా?'' అప్పుడప్పుడు నేనే మాట నాకే తిప్పికొట్టింది.

''పొద్దున్న ఆరు గంటలకల్లా మొదలవుతుంది మన షెడ్యూల్'' అప్పుడే ప్రణాళిక రెడీ చేసి పెట్టుకున్నట్టుంది.


''ముందుగా నేను కాఫీ డికాషన్ తీసి, ఆపైన వాకిలి కడిగి ముగ్గేసి వస్తాను. ఈలోగా మీరు పాలు కాచి కాఫీ తయారు చేస్తారు''


పొద్దున్నే కాఫీ తాగందే బెడ్ మంచి లేచే అలవాటులేని నేను, నా చేతుల్తో కాఫీ కాయాలా? ఇదెక్కడి బాధ? మనసులో అనుకున్నాను.

''తర్వాత నేను అంట్లు తోముతుండగా మీరు మంచినీళ్లు పడతారు అన్నట్టు అరగంట మించి నీళ్లు రావు. గబగబా నాలుగు బిందెలు పట్టుకుని ఆపైన బకెట్లూ, డ్రమ్మూ నింపుకోవాలి''

చచ్చాను. ఈ నీళ్లు పట్టడం నా వల్ల కాదంటే అంట్లు తోమమంటుందేమో? అంతకన్నా ఇదే బెటర్.

''మరో పక్క నేను టిఫిన్ తయారుచేస్తుండగా





మీరు చెట్నీ గ్రైండ్ చేసేస్తారు'' మళ్లీ ఇదొకటా?

''అదయ్యాక మీరు కాస్త కూరలు తరిగి ఇచ్చేస్తే నేను కుక్కర్ పెట్టేస్తాను'' బాగా ఇరుక్కుపోయాను.

డిగ్నిటీ ఆఫ్ లేబర్ అనీ, అదనీ, ఇదనీ అనవసరంగా వాగాను. ఇప్పుడు తప్పించుకోడానికి లేకుండా పోయింది. పైగా ఆవిడ కూడా ఉద్యోగం చేస్తోంది కాబట్టి నేను కూడా ఈ పన్లు షేర్ చేసుకోక తప్పదు. పైగా పిల్లలు చిన్నవాళ్లు. వాళ్ల పనే చేసుకోలేరు.

ఇక తప్పేదేముంది. చచ్చినట్టు ఆరుగంటలకి లేచాను. లేచింది మొదలు ఒకటే హడావుడీ, హైరానా. కాఫీ కోసం పాలు స్టౌ మీద పెట్టి వెలిగిందో లేదో ''ఏమండోయ్, కుళాయి వదిలాడు. నీళ్లు పట్టండి నా చెయ్యి బాలేదు'' అంట్లు తోముతూ అరిచింది మా ఆవిడ. ఇటుపక్క కాఫీ పని చూస్తూ అటు నీళ్లు పడుతూ, ద్విపాత్రాభినయం చేశాను. తత్ ఫలితంగా అటు పాలు పొంగిపోయాయి. ఇంకా డ్రమ్ము నిండకుండానే కుళాయి ఆగిపోయింది. పాలు స్టౌబర్నర్ మీద పడి స్టౌ ఆరిపోయింది. నాకు పిచ్చి కోపం వచ్చింది.

''అందుకే అంత హడావుడి పెట్టకూడదు. అయినా ఒకేసారి రెండు పనులెలా అవుతాయి? నిదానంగా చెయ్యొచ్చుగా? నీకు గాభరా ఎక్కువ'' అరిచాను.

''బాగుంది. నిదానంగా చేస్తూ కూర్చుంటే ఆఫీసుకెళ్లేలోగా పనులన్నీ పూర్తి కావద్దూ? టైమ్ చూడండి ఎంత యిందో?'' మా ఆవిడ రివర్స్

అయింది బర్నర్ తుడుచుకుంటూ. ఇంకేమీ అనలేకపోయాను.

ఇక చెట్నీ చెయ్యడం మొదలెట్టాను. 'కాంచన్ మిక్సీ మీ ఇంట్లో ఉంటే చెట్నీలు, పొడులూ నిముషాల్లో రెడీ' టీవీ యాడ్ గుర్తుకొచ్చింది. అందులో చెప్పినట్టుగా చెట్నీ గ్రైండ్ చేయడమయితే రెండు నిముషాల్లో అయిపోతుంది కానీ, దాని ముందూ వెనుకా ఇంత తతంగం ఉంటుందని నాకు తెలీదు. కొబ్బరికాయ కొట్టి ముక్కలు చేసి, ఇంకా పచ్చిమిర్చి పోపుసామానూ వగైరా సిద్ధం చేసుకోవడానికి ఇరవై నిముషాలు పట్టింది నాకు. చెట్నీ తీసి గిన్నెలో వేయడం, జార్ కడగడం, మిక్సీ శుభ్రం చేసుకోవడం ఇవన్నీ అయ్యేసరికి మరో పది నిముషాలు. అరగంట ఈ పనికే అయిపోయింది.

నా స్పీడ్ చూసి ఇక లాభం లేదనుకుందో ఏమో మా ఆవిడే కూరలు తరుక్కుని కుక్కర్ పెట్టేసింది. అలా ఒక దానివెంట ఒకటి చకచకా చేసుకెళ్లిపోతోంది విసుగు లేకుండా. ఆవిడలా బొంగరంలా అటూఇటూ తిరుగుతుంటే నాకు కళ్లు తిరుగుతున్నాయి. ఒక కుర్చీలో కూలబడ్డాను అలసటగా. సుఖాన్నున్న ప్రాణాన్ని దుఖాన పెట్టుకున్నాను కదా!

పొద్దున్న 7 గంటలకి లేచేసరికల్లా కాఫీ, 8 గంటలకి టిఫిన్, తర్వాత స్నానం చేసి రెడీ అయి వచ్చేసరికల్లా లంచ్‌బాక్స్ అన్నీ రెడీగా అమర్చి పెడుతుంటే హాయిగా ఉండేది కానీ, వాటి వెనుక ఆవిడ పడే కష్టం ఏమిటో ఈ రోజు తెలుసొచ్చింది. అమ్మో! ఇంటిపనులంటే ఈజీ ఏం కాదు.

నా పరిస్థితి చూసి జాలిపడిందో ఏమో ''బట్టలు సాయంత్రం ఉతకొచ్చులెండి'' అంది కనికరిస్తున్నట్లుగా. అంటే, సాయంత్రం ఇంటికొచ్చాక మళ్లీ రేవు, ఓర్నాయనో నా వల్ల కాదు.

''మీరు చెప్పినట్టుగా అమెరికాలో పనివాళ్లు దొరకరు కానీ, మా మరిది అన్ని పనుల్లో సాయం చేసి పెడతాడు మా చెల్లెలికి. లేకపోతే ఇంటెడు పనీ చేసుకుని ఆఫీసుకెలాగెడుతుందది?'' నిన్న నేనన్న మాటలకి బదులుగా చురక అంటించింది.

అంటే? నేనిలా ఫిక్స్ అయిపోవలసిందేనా? బాబోయ్ అనవసరంగా ఇరుక్కుపోయాను.

వంట పూర్తి చేసి క్యారియర్స్ సర్దేసింది చకచకా. ''అయ్యో, అలా కూర్చున్నారేమిటీ స్నానం చేయండి టైమయిపోతోంది'' హెచ్చరించింది నన్ను.

గబగబా స్నానం చేసి రెడీ అయ్యాను. అప్పటికే లేట్. ఏదో రెండు ఇడ్లీలు నోట్లో కుక్కేసుకుని ఆఫీసుకు పరిగెట్టాను. సీట్లో కూర్చున్నానే గానీ పని సాగటం లేదు. పొద్దున్నే లేచానేమో కళ్లు మండుతున్నాయి. రోజూలా సుష్టుగా టిఫిన్ తినలేదేమో ఓ పక్క ఆకలి దంచేస్తోంది.

ఒక్క రోజుకే ఇలా అయిపోయేను. ఇక రోజూ ఇలా చేస్తే ఏమయిపోవాలి?

మరయితే రోజూ పొద్దున్నా, సాయంత్రం ఇన్ని పనులూ చేసుకుని ఉద్యోగం చేస్తూ కూడా ఇంటిని శుభ్రంగా అద్దంలా ఉంచడం మా శ్రీమతికెలా సాధ్యమవుతోంది? ఆవిడకేం నాలుగు చేతులు లేవు కదా! నేనేనాడు ఈ పనుల్లో వేలు పెట్టేవాడిని కాదు.

ఆలోచించగా ఇప్పుడర్థమవుతోంది మా ఇంట్లో పనిమనిషి పాత్రేమిటో? మా ఆవిడ దానికి ఎందుకంత ఇంపార్టెన్స్ ఇస్తోందో? ఇక్కడ పుల్ల తీసి అక్కడ పెట్టని నాలాంటి మగాళ్లున్న ఇళ్లల్లో ఆడవాళ్లని ఆదుకునేది పనిమనుషులేగా. మేమిచ్చే ఆరొందల జీతానికి ఎంత చాకిరీ చేస్తోందో కదా! మొదటిసారిగా పనిమనిషి మీద సదభిప్రాయం కలిగింది.

నోర్మూసుకుని, మా ఆవిడ చెప్పినట్టుగా పనిపిల్లని వెతికి పెట్టి ఉంటే నాకీ పాట్లు ఉండేవి కావు కదా! అనవసరంగా క్లాసు పీకి రెచ్చగొట్టాను. ఆవిడేం తక్కువ తినలేదుగా నన్నిలా ఇరికించింది. ఇప్పుడు తెలిసొచ్చింది. తక్షణం కర్తవ్యం గుర్తుకొచ్చింది.

సాయంత్రం ఆఫీసు నుండి రాజేష్ ఇంటికి వెళ్లాను గంట పర్మిషన్ పెట్టి. వాళ్లావిడ చెప్పిన గుర్తుల ప్రకారం పనిమనిషి ఇల్లు కనుక్కుని, ఆ పిల్ల తల్లికి నెల జీతం అడ్వాన్స్ ఇచ్చి మరీ పనికి కుదుర్చుకున్నాను.

నాతోబాటు స్కూటర్ దిగుతున్న పనిపిల్లని చూసి, మా ఆవిడ సంభ్రమాశ్చర్యాలకి లోనయ్యింది. తర్వాత బోలెడు ఆనందపడిపోయింది. ఈసారి ఆవిడ ఆనందం చూసి నాకు కోపం రాలేదు. నేనూ లోలోపలే సంతోషించాను.

☆



## కొత్త ప్రేమ?

**బాలీవుడ్ భామ కంగనా రనౌత్ మొదట్లో నటనకు ప్రాధాన్యం వుండే ఆఫ్‌బీట్ సినిమాల్లో నటించింది. ఎప్పుడైతే కమర్షియల్ సినిమాల హీరోయిన్‌గా మారిందో అప్పటి నుంచీ ప్రేమాయణాలతో పబ్లిసిటీ సంపాదించుకుంటోంది. ఆమెకి నటన కంటే ఎఫైర్‌ల ద్వారా వచ్చే పాపులారిటీయే ఎక్కువగా కనిపిస్తోంది. నిన్నమొన్నటి వరకూ అధ్యయన్ సుమన్‌తో చెట్టాపట్టాలేసుకుని తిరిగిన ఈమె అతడికి కటీఫ్ చెప్పేసింది. తాజాగా ఆమె మెక్సికన్ తార బార్బరా మోరి తమ్ముడు కింటో మోరితో దోస్తీ చేసేస్తోందని బాలీవుడ్ వార్తలు చెబుతున్నాయి.**